
అనంతపురం పాతూరు అమ్మవారిశాల ఆలయ ఆవరణలో వన విహారిణి శాకంబరి అలంకరణ


కొత్తూరు అమ్మవారిశాలలో విశేష అలంకరణ

## వన విహారిణీ.. నమోస్తుతే..!

### శాకంబరిగా వాసవీ మాత

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు వివిధ రూపాలలలో భక్తులను అనుగ్రహించారు. నాలుగో రోజు గురువారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. సంగీత, నృత్య ప్రదర్శనలు కొనసాగాయి. అమ్మవారి ఉత్సవ మూర్తులు, మూల విరాట్‌లను విశేషంగా అలంకరించారు. అనంతపురం నగరంలోని కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను గోమతి చక్రాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులను అట్టుక్కల్ భగవతి అమ్మన్(కేరళ), విష్ణుదుర్గాదేవి, పట్టీశ్వరన్ దుర్గాదేవిగా అలంకరించి, కొలువుదీర్చారు. పాతూరు ఆలయంలో అమ్మవారిని నీలిరంగు పూలతో అలంకరించారు. ఉత్సవమూర్తిని వనవిహారిణి శాకాంబరిగా అలంకరించారు. వాసవీమాత తాడిపత్రిలో గజలక్ష్మి అలంకరణలో, కదిరిలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. గుత్తి మండలం సేవాఘడ్‌లో కాత్యాయిని అలంకరణలో మాతా జగదాంబ భక్తులను అనుగ్రహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

## అమాయకులపై కేసులు ఎత్తివేయండి

### అసెంబ్లీలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి



తాడిపత్రి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో తమ నియోజకవర్గంలో అమాయకులపై కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి కోరారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడారు. తన తండ్రి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 200 వరకు కేసులు అక్రమంగా పెట్టారని అన్నారు. వీటి గురించి తాము మాట్లాడలేదని, కానీ టీడీపీ జెండా మోసిన కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి హింసించారని అన్నారు. వారి పిల్లలను ఉద్యోగాల నుంచి తొలగించారని, కళాశాలల్లో సీటు కూడా లేకుండా చేశారని అన్నారు. డీఎస్పీగా చైతన్య ఉన్న సమయంలో లాకప్‌డెత్ జరిగిందని, ఆ కుటుంబాన్ని మభ్యపెట్టి సహజ మరణం అన్నట్లుగా కేసు నమోదు చేసి, కొట్టివేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బాధిత కుటుంబ సభ్యుల చేత మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇప్పించామని, కేసును రీ ఓపెన్ చేయించి డీజీపీకి పంపించామని తెలిపారు. ఆ కేసు గురించి పట్టించుకోవడంలేదని, ఈ అంశంపై హోం మంత్రి ప్రత్యేక దృష్టిపెట్టి న్యాయం చేయాలని కోరారు.




## కలెక్టరేట్‌ను గ్రీన్ ఆఫీస్‌గా తీర్చిదిద్దుతాం

### కలెక్టర్ ఆనంద్


కలెక్టరేట్‌లో శుభ్రం చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌ను మొదట గ్రీన్ ఆఫీస్‌గా తీర్చిదిద్దుతామని, అక్టోబరు 2 నాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను గ్రీన్ ఆఫీసులుగా చేస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాథ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో గురువారం శ్రమదానం చేశారు. జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్వో మలోల తదితరులతో కలిసి కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేశారు. ఒక రోజు.. ఒక గంట.. అందరం కలిసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని కలెక్టర్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని, మొక్కలు నాటి, బాధ్యతగా సంరక్షించాలని కోరారు. అక్టోబరు 2 నాటికి మున్సిపల్ స్థాయిలో బట్ట బ్యాగులను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్, బట్ట సంచులను వాడాలని కోరారు. అనంతరం 'స్వచ్ఛతా హీ సేవ స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' ప్రతిజ్ఞ చేయించారు.

## సతీష్‌ది హత్య కాదు.. ప్రమాదమే..!


ఘటనా స్థలం వద్ద పోలీసులు

అనంతపురం క్రైం, పామిడి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పామిడి మండలం కాలాపురం సమీపంలో 'వైసీపీ కార్యకర్త అనుమానాస్పద మృతి' ఘటనపై స్పష్టత వచ్చింది. జి.కొట్టాలకు చెందిన దేవన సతీష్ కుమార్ రెడ్డి మరణానికి రోడ్డు ప్రమాదమే కారణమని ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పోస్టుమార్టం నివేదిక, స్థానిక పోలీసుల ప్రాథమిక విచారణ ఆధారంగా ప్రమాదమని నిర్ధారణకు వచ్చారు. సతీష్ పామిడిలో మద్యం సేవించి, బైక్‌పై స్వగ్రామానికి వెళుతూ, కాలాపురం వద్ద ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోతూ ఢీకొన్నాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ దేవరపల్లి సాయికుమార్ పోలీసుల విచారణలో పలు విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. 'కాలాపురం వద్ద ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టిన శబ్దం వచ్చింది. వెళ్లి చూస్తే యువకుడు అక్కడికక్కడే మరణించాడని అర్థమైంది. నాకు ఇబ్బంది అవుతుందని, ట్రాక్టర్ ఓనర్‌కు, మా అక్క, బావకు ఫోన్ చేసి విషయం చెప్పాను. మళ్లీ చూద్దాం.. వచ్చేయ్ అని వారు చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాను..' అని చెప్పినట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని పోలీసులు గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు జాగిలాన్ని రప్పించి తనిఖీ చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దర్యాప్తును వేగవంతం చేయాలని, నిజాలను నిగ్గుతేల్చాలని కోరారు.




## నవంబరులో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

### రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 7,8,9 తేదీల్లో రాష్ట్ర స్థాయి క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణశర్మలతో కలిసి ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. నగర శివారు ఆర్డీటీ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలు, సీసీఎల్ఏ కార్యాలయం మొత్తంగా 27 యూనిట్ల నుంచి పాల్గొనే కంటింజెంట్లకు సంబంధించిన డ్రెస్ కోడ్ రంగులను లాటరీ పద్ధతిలో నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్, డీఆర్ఓ మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, మల్లికార్జున రెడ్డి, ఎస్‌డీసీ మల్లికార్జున, అనంతపురం రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్‌రావు, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మధునాయక్ పాల్గొన్నారు.

## వచ్చేశాయ్... ఉద్యోగాలు..!

### అమరావతిలో నియామకపత్రాలు.. మెగా డీఎస్సీ సభ విజయవంతం



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులను అభినందిస్తున్న మంత్రి కేశవ్

5

## ఎమ్మెల్యే దగ్గుపాటి పేరిట ఎక్స్‌లో ఫేక్ అకౌంట్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ సోషల్ మీడియా విభాగం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేరిట ఎక్స్‌లో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేశారు. అందులో పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమాకు మద్దతు తెలుపుతున్నట్లు పోస్టు పెట్టారు. పవన్ కల్యాణ్ మంచి మనసున్న మనిషి అని, తమ పార్టీ అంధకారంలో ఉండగా మద్దతుగా నిలిచారని, తాము ఆయన కోసం నిలబడతామని అందులో రాశారు. అనంతపురం తాను దగ్గరుండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఓజీ సినిమా ప్రదర్శనలు జరిగేలా చూస్తానని దగ్గుపాటి పేర్కొన్నట్లు కూడా రాశారు. దీన్ని గురువారం ఉదయం గమనించి టీడీపీ సోషల్ మీడియా విభాగం, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. అది ఫేక్ అకౌంట్ అని నిర్ధారించుకుని, అనంతపురం టూ టౌన్ పోలీసులకు సోషల్ మీడియా టీం సభ్యులు, టీడీపీ నాయకుడు సుధాకర్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి, ఎమ్మెల్యేపై కుట్రలు పన్నినవారిపై చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను కోరారు.




ఎమ్మెల్యే దగ్గుపాటి ఫేక్, ఒరిజినల్ అకౌంట్స్

## ప్రతి లే అవుట్‌కు అనుమతి తప్పనిసరి: అహుడా చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని వెంచర్, లే అవుట్‌లు నిబంధనల ప్రకారం అనుమతి పొంది ఉండాలని, లేనిపక్షంలో బ్లాక్‌లిస్టులో పెడతామని చైర్మన్ టీసీ వరుణ్, వైస్‌చైర్మన్ జేసీ శివనారాయణ శర్మ హెచ్చరించారు. అహుడా కార్యాలయంలో లే అవుట్ల రెగ్యులరైజేషన్, ఎల్ఆర్ఎస్‌పై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. అహుడా పరిధిలోని నియోజకవర్గాలు, మండలాలు, పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా అనుమతి లేని లేఅవుట్లపై సమీక్షించారు. అనుమతిలేని లేఅవుట్లను వెంటనే ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని సూచించారు. అక్టోబరు 23లోపు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఐజీ లేఔట్లలో పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు అహుడా కార్యాలయంలో లే అవుట్, భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఎంఐజీ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చునని సూచించారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, పీఓ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.



## త్రివిక్రమావతారంలో ఖాద్రీశుడు



త్రివిక్రమావతారంలో శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కదిరి లక్ష్మీనరసింహస్వామి గురువారం త్రివిక్రమావతారంలో భక్తులకు దర్శనమించారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం త్రివిక్రమావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.

# వచ్చేశాయ్.. ఉద్యోగాలు..!

- అమరావతిలో నియామకపత్రాలు
- మెగా డీఎస్సీ సభ విజయవంతం

అనంతపురం విద్య, క్రైం, రాప్తాడు, పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో అమరావతిలో గురువారం నియామక పత్రాలను అందజేశారు. సభ విజయవంతం కావడంతో జిల్లా విద్యాశాఖ హర్షం వ్యక్తం చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి 45 బస్సులలో అభ్యర్థులను, వారి కుటుంబ సభ్యులను అమరావతికి తీసుకెళ్లారు. దాదాపు 2వేల మంది అమరావతికి వెళ్లారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సందేశాలను సంతోషంగా విన్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఎస్సీ అభ్యర్థి నవీన్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూర, జేసీ అశ్మిత్ రెడ్డి తదితరులు తమ తమ నియోజకవర్గ అభ్యర్థులకు అభినందలు తెలుపుతూ సందడిగా గడిపారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా కార్యక్రమం ముగిసిందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీ కోసం ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కళ్లలో అసలైన ఆనందం ఇప్పుడే చూస్తున్నామని ఎమ్మెల్యేలు అన్నారు. నూతన ఉపాధ్యాయులకు ఆమె అమరావతిలో నియామక పత్రాలను అందజేసి, అభినందించారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేశారని అన్నారు.



నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, హాజరైన ఎమ్మెల్యేలు







కొత్త ఉపాధ్యాయులకు డీఎస్సీ నియామక పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత





మెగా డీఎస్సీ సభలో అనంతపురం జిల్లా అభ్యర్థులు

### క్రైం కార్నర్

## రూ.10 లక్షలు చోరీ



బాధితురాలు గీతమ్మ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుమారుడి చదువు కోసం ఇంట్లో దాచుకున్న సొమ్ము, బంగారం చోరీ అయినట్లు బాధితురాలు గీతమ్మ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు గీతమ్మ తెలిపిన మేరకు.. తాను తన భర్త సూర్యనారాయణ చేనేత వృత్తి చేసుకుంటూ లక్ష్మీచెన్నకేశవపురంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తయిన తమ కుమారుడి ఉన్నత విద్య కోసం అప్పులు చేసి, చీరల వ్యాపారంలో వచ్చిన డబ్బులు రూ.10లక్షల సమకూర్చి ఇంటిలో పెట్టుకున్నామన్నారు. ఈనెల 23న తమ కుమారుడిని కళాశాలలో చేర్పించడానికి తన భర్త సూర్యనారాయణ గుంటూరుకు వెళ్లాడన్నారు. మరుసటి రోజు తాను ఇంటికి తాళం వేసి గోరంట్లకు వెళ్లినట్లు తెలిపారు. అయితే గురువారం మా ఇంటి చుట్టు పక్కన ఉండేవాళ్లు ఫోన్ చేసి 'మీ ఇంటితాళాలు పగలగొట్టినట్లు ఉందని' సమాచారం ఇచ్చారు. దీంతో తాను హుటాహుటిన ధర్మవరంలోని ఇంటికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీరువాలో ఉంచిన రూ. 10లక్షల నగదు, మూడు జతల బంగారు కమ్మలు, చేతి ఉంగరం సుమారు తులం బంగారం చోరీ జరిగినట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## ప్రాణం తీసిన ఆర్థిక సమస్యలు



తిప్పేస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచప్పబావి కాలనీకి చెందిన తిప్పేస్వామి (34) ఆర్థిక సమస్యలతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య గీతాంజలి, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈక్రమంలో తీవ్రంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య గీతాంజలి ఉరికి వేలాడుతున్న భర్త తిప్పేస్వామిని చూసి బోరున విలపించారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాసత్రికి తరలించారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, తాటిచెర్ల రైల్వే స్టేషన్ మధ్యలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో గుత్తి మీదుగా బెంగళూరు వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463) రైలు కింద పడి 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తి మృతి చెందాడన్నారు. సంఘటన స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ దామోదర్ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 7013308693ని సంప్రదించాలని సూచించారు.

## కార్మికులకు బీమా చేయండి

- పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ ఆదేశం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ కార్మికులు, క్లాప్ మిత్రలకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పోస్టల్ మ్యూచువల్ ఇన్స్యూరెన్స్ చెల్లించాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన కార్మికుల బీమాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా బీమాను అమలు చేయాలని ఆదేశించారు. అందుకు కావాల్సిన నిధుల కోసం పంచాయతీలో తీర్మానం చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులు వినియోగించుకొని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఓపెన్‌స్కూళ్లు అడ్మిషన్ల గడువు పొడిగింపు

అనంతపురంవిద్య, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్‌స్కూళ్ల)అడ్మిషన్లకు ఈనెల 31వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం తెలిపారు. పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు చేసుకోవాలంటే రూ.200లు అపరాధ రుసుం చెల్లించి చేరవచ్చన్నారు.

## బంగారు తల్లీ.. నిన్నెలా వదిలేశారే..?



దొరికిన శిశువు

అనంతపురంవైద్యం/ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డను చెత్తకుప్పల పాల్జేసిన సంఘటన గురువారం తెల్లవారుజామున నగరంలో వెలుగుచూసింది. కేకలు విన్న స్థానికులు చిన్నారిని చేరదీసి, సపర్యలు చేసి, అధికారులకు అప్పగించారు. జిల్లాకేంద్రంలోని సాయినగర్ ఏడో క్రాస్‌లో గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఓ చెత్త సంచి నుంచి చిన్నారి కేకలు వినిపించాయి. ఈ ఏడుపు విన్న చుట్టుపక్కల ప్రాంత మహిళలు ఆ సంచిని తెరిచి చూడగా పసికందు కనిపించింది. బొడ్డు తాడు కూడా కోయని ఆ చిన్నారిని చూసి వారు చలించిపోయారు. చిన్నారిని చేరదీసి, సపర్యలు చేసి, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకొని చిన్నారిని ప్రభుత్వసర్వజన వైద్యశాలకు తరలించారు. మూడు రోజులు పర్యవేక్షణలో ఉంచాలని వైద్యులు తెలిపారు.

**పాపాయి మాకే కావాలి**

చెత్త సంచిలో ఉన్న శిశువు పట్ల కొందరు స్థానిక మహిళలు మమకారం చూపించారు. ముద్దు బొద్దుగా ఉన్న ఆ పాపాయిని ఇస్తే, పెంచుకుంటామని పోటీపడ్డారు. పాపను తీసుకెళ్లేందుకు వచ్చిన అధికారులను సైతం ప్రాధేయపడ్డారు. అయితే అధికారులు నిబంధనల మేరకు దత్తత తీసుకోవాల్సి ఉంటుందని చిన్నారిని తీసుకెళ్లారు.

# ఇంధన ల్యాండ్‌మార్క్‌గా సత్యసాయి

- కలెక్టర్ శ్యాంప్రసాద్
- రామగిరిలో 300 మెగావాట్ల సోలార్‌విద్యుత్ ప్రాజెక్టు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపనలో కలెక్టర్ తదితరులు

రామగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఇంధనం విషయంలో శ్రీసత్యసాయి జిల్లాను ప్రపంచంలోనే ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గురువారం మధ్యాహ్నం రాజస్థాన్ రాష్ట్రం బాన్సువార నుంచి వర్చువల్‌గా రామగిరిలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రామగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రాబోయే రోజుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందన్నారు. రామగిరిలో 1047ఎకరాలలో 300మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విజనరీ లీడర్ అని, ఆయన ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మన రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి సీఎం చంద్రబాబుకు మనమందరం తోడ్పాటు అందించాలని అవసరం ఉందన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీలో మన రాష్ట్రం పయనీరుగా ఉంది. ఇప్పటివరకు రాష్ట్రం మొత్తంమీద దాదాపు 5వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇంధనంలో ప్రపంచంలోనే శ్రీసత్యసాయి జిల్లా ఒక ల్యాండ్‌మార్క్‌గా మారేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొగ్గు ఆధారిత విద్యుత్‌తో పోలిస్తే క్లీన్‌అండ్ గ్రీన్ ఎనర్జీ పర్యావరణానికి ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఏర్పాటులో కృషిచేసిన అచీవర్స్‌కు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందజేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో సెకీ వీసీఅండ్ ఎండీ కమలాకర్‌బాబు, ఆర్డీఓ మహేష్, సెకీ ఈడీ శివశంకర్‌నాయుడు, తహసీల్దార్ రవికుమార్‌తో పాటు పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం: డీఎంఈ





మాట్లాడుతున్న సీనియర్ డీఎంఈ రమేష్

గుత్తి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్ పేర్కొన్నారు. గుత్తిఆర్ఎస్‌లో రైల్వే ఇనిస్టిట్యూట్ క్రీడామైదానంలో అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. గౌతమి పూరి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను డీఎంఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మీయా, ఎస్ఐ సురేష్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దివంగత క్రీడాకారులు ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను వారి జ్ఞాపకార్థం స్నేహితులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. టోర్నమెంట్‌లో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, రాజా, నవీన్, గిరిబాబు, డాడి, ప్రసాద్, హరినాథ్‌రెడ్డి, చాంద్, విజయ్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల కోసం రూ. 90 కోట్లు ఇవ్వండి

- మంత్రులను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం/ క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం గురువారం ఆమె మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్‌లను వారి కార్యాలయాల్లో కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతపురం బైపాస్ నుంచి కనగానపల్లి రోడ్డు, కనగానపల్లి నుంచి చిగురుచెట్టు రోడ్డు, ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు, పంగల్‌రోడ్డు సమీపం నుంచి చిగిచెర్లకు వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయని నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో 5 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో న్యామద్దల, మద్దలచెరువు, దాదులూరు, సోమలదొడ్డి, ఆలమూరు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. తన విజ్ఞప్తులపై మంత్రులు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యాసాధ్యాలు పరిశీలించి వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు.

### చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి రూ.13వేలు పలికాయన్నారు.

### గడువు పొడిగింపు

లేపాక్షి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో ఖాళీగా ఉన్న 9, 11 తరగతుల సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి గడువు అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. గతంలో ప్రవేశం కోసం సెప్టెంబరు 24వరకు ఉండేదని దానిని పొడిగించినట్లు తెలిపారు.

## పుట్లూరు, యల్లనూరుకు సాగునీరు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి

పుట్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని పుట్లూరు, యల్లనూరు మండలాలకు తాగు, సాగునీటిని ఇవ్వాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని శాసనమండలిలో గురువారం ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో సుమారు 80వేల ఎకరాల్లో పండ్ల తోటలు ఉన్నాయన్నారు. వీటిలో చీనీ, అరటి, మామిడి, సపోట తదితర ఉద్యాన పంటలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ మండలాలకు రావాల్సిన హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిత్రావతి నదిపై రిజర్వాయర్ ఉన్నప్పటికి నీరు పారక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరు చెరువుకు అక్కడి నుంచి సుబ్బరాయసాగర్‌కు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోతల ద్వారా కేటాయించాలని విన్నవించారు. దీంతో ఆ రెండు మండలాలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు.

## ఎస్ఎస్‌బీఎన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు జాతీయ పతకాలు



పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను సన్మానిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు పతకాలు దక్కినట్లు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ అధికారి ప్రొఫెసర్ మురళి గురువారం తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన 8వ అఖిలభారత థాల్ సైనిక్ క్యాంపులో జిల్లాకు చెందిన ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు కృష్ణ, కిరణ్, నానివాదన్‌లు అత్యంత ప్రతిభ కనబరిచి రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ది బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈఓ దేవకుమార్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గల్లా హర్ష, భవాని రవికుమార్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె శాంతరాజ్, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.16, కనిష్ఠంగా రూ.8, సరాసరి రూ.12తో తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు 3,150టన్నుల టమోటాల వచ్చినట్లు పేర్కొన్నారు.

## హైటెక్ పద్ధతిలో మద్యం అక్రమ రవాణా

- వందల కిలోమీటర్లు ఛేజ్ చేసి పట్టుకున్నాం
- జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అనంతపురం క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): 'ముందు వెళ్తున్న వాహనంలోని వ్యక్తులు వాకీటాకీలతో ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారు. దీని వెనుక వస్తున్న వాహనంలో ఉన్న వ్యక్తులు ముందున్న వారిచ్చే సూచనల మేరకు మద్యాన్ని అక్రమంగా జిల్లాకు రవాణా చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో గోవా అక్రమ మద్యం రవాణా కేసు ఛేదింపు వెనుక ఉన్న విస్తుగొలిపే విషయాలు, గంజాయి నియంత్రణకు చేపడుతున్న చర్యలపై స్పందించారు.

**ప్రశ్న:** ఎప్పటి నుంచి గోవా అక్రమ మద్యం రవాణాపై నిఘా పెట్టారు..?

**ఏసీ:** మద్యాన్ని గోవా నుంచి తెచ్చి కడప జిల్లా ప్రొద్దుటూరులో అమ్ముతున్నారు. గోవా మద్యం అక్రమ రవాణ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు వీరేంద్రపై నిఘా పెట్టాం. మొదట అతడి నుంచి మద్యం కొంటున్నవారిని ఆరా తీశాం. తర్వాత వారు వెళ్లే వాహనాల కోసం టోల్‌ప్లాజాల్లో కూడా వెతికాం. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోడానికే సుమారు ఆరు మాసాల నుంచి నిఘా ఉంచాం.

**ప్రశ్న:** గోవా నుంచి ఇక్కడకు ఎలా తెస్తున్నారు..?

**ఏసీ:** గోవా నుంచి లిక్కర్‌ను జిల్లా సరిహద్దుల్లోకి తెచ్చి, తర్వాత కడప జిల్లా ప్రొద్దుటూరు చేర్చడం వాళ్ల లక్ష్యం. గోవాలోని మపూస బీచ్ ఏరియాలో లిక్కర్ కొంటారు. అక్కడి నుంచి హెబెకవాడి టోల్‌ప్లాజా మీదుగా చెల్లగిరి, హెబ్బాల్ మీదుగా కుందుర్పి సమీపంలో అనంతపురం జిల్లాలోకి వస్తారు. తర్వాత కళ్యాణదుర్గం, వడ్డుపల్లి, అనంతపురం, తాడిపత్రి, ముద్దనూరు మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుని అక్కడ విక్రయిస్తారు.

**ప్రశ్న:** మద్యం రవాణా ముఠా సభ్యులు ఎలా తప్పించుకుంటారు..?

**ఏసీ:** గోవా అక్రమ మద్యం రవాణాలో వీరేంద్ర కీలక నిందితుడు. ఇతడిపై ఎక్సైజ్, పోలీసు కేసులే 10 వరకూ ఉన్నాయి. హైదరాబాద్‌లోని కోఠిలో వాకీటాకీలు కొన్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని చోట వీటిని హైటెక్ పద్ధతిలో ఉపయోగిస్తారు. ముందు వెళ్తున్న పైలెట్ వాహనంలోని వ్యక్తులు వాకీటాకీలతో వెనుక వచ్చే వాహనంలోని వారికి సమాచారం ఇస్తారు. దీని ఆధారంగా పోలీసుల కళ్లుగప్పి మద్యం రవాణా చేస్తారు.

**ప్రశ్న:** వీళ్లు ఎన్నేళ్ల నుంచి మద్యం అక్రమ రవాణా చేస్తున్నారు..?

**ఏసీ:** కీలక నిందితుడైన వీరేంద్ర, సుమారు ఐదేళ్లుగా చేస్తున్నాడు. గతంలో 10 నెలలు జైలుకు కూడా వెళ్లివచ్చాడు. ఇన్నోవాతోపాటు, మరో వాహనం తీసుకుని, మరికొందరిని పెట్టుకుని అక్రమంగా గోవా మద్యం రవాణా చేస్తున్నాడు. ఈ బిజినెస్ లేనప్పుడు హైదరా బాద్‌లో ర్యాపిడో డ్రైవర్‌గా కూడా వెళ్తాడు.

**ప్రశ్న:** ఈ ముఠా సభ్యులు ఎంత అక్రమ మద్యం రవాణా చేస్తారు..?

**ఏసీ:** మామూలుగా 70 బాక్సుల్లో లిక్కర్ తెచ్చేవాళ్లు. ఈసారి దసరా పండుగా ఉందని 110 బాక్సుల్లో తీసుకొచ్చారు. ఈ నెల 22న టోల్ ప్లాజా వద్ద కూడా వెహికల్స్ వెళ్లడం సీసీ కెమెరాల్లో గుర్తించి, నిఘా పెట్టాం.

**ప్రశ్న:** ఎలా ఛేజ్ చేశారు....? ఎన్ని కిలోమీటర్లు వెంబడించారు..?

**ఏసీ:** వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద రెండు వెహికల్స్ రాగానే గుర్తించాం. మా డిపార్టుమెంట్ వాళ్లను చూడగానే..ఇన్నోవా వాహనం వెనక్కు తిప్పి పరుగు తీశారు. మా టీం వెంబడించింది. సుమారు 200 నుంచి 300 కిలోమీటర్లు తిరిగి పట్టేశాం.

**ప్రశ్న:** కొందరు విద్యార్థుల్లో పెరిగిన గంజాయి వాడకాన్ని ఎలా అరికడతారు?

**ఏసీ:** కొన్ని చోట్ల కొందరు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థులు వాడుతున్నట్టు గుర్తించాం. ఎవరు వాడినా ఇది చాలా ప్రమాదకరం. విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకు సైతం అవేర్‌నెస్ మీటింగ్స్ పెట్టి...అవగాహన కల్పిస్తున్నాం.

## 'బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి'

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎంఈజీపీ, ముద్ర, పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రుణాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. జిల్లాలో అన్ని బ్యాంకుల బ్రాంచ్‌లు దీనిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రూడ్‌సెట్ ద్వారా మరింత ఎక్కువమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణనిర్వహించేందుకు బ్యాంకులు సీఎస్ఆర్ యాక్టివిటీ కింద ఆర్థిక సహకారం అందించాని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, ఆర్‌బీఐ అధికారి రాహుల్ అగర్వాల్, ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి, నాబార్డు ఏజీఎం అనూరాధ, డీఆర్డీఏ పీడీ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ



ఎంసీపల్లిలో స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎల్.నారాయణచౌదరి

రామగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రేషన్ షాపుల్లోనూ రేషన్‌లబ్ధిదారులకు స్మార్ట్‌రేషన్‌కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఎంసీపల్లి, గరిమేకలపల్లి, తిమ్మాపురం, మార్కాపురం గ్రామాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణ చౌదరి పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతిగ్రామంలో టీడీపీ నాయకులు, అధికారులు ఇంటింటా తిరిగి కార్డులు పంపిణీ చేశారు.

## ఘనంగా హ్యాకథాన్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ -2025ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఈసీఈ విభాగాధిపతి మమత, సంచాలకులుగా కేశవరెడ్డి, రమణరెడ్డి, రాజశేఖర్, లలిత వ్యవహరించారు. వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ..స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులు పాల్గొనడం శుభపరిణామం అన్నారు. ఇలాంటి అవకాశాలు విద్యార్థుల ప్రతిభను దేశానికి పరిచయం చేయడమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు దారితీస్తాయని అన్నారు.

## క్రీడా సామగ్రి అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడాకారులకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. నగరంలోని కేఎస్ఆర్ అర్బన్ సిటీలో గల తైక్వాండో శిక్షణా కేంద్రంలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ది బోర్డు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈఓ దేవకుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్ వాటిని పంపిణీ చేశారు. పేద క్రీడాకారులకు తమ వంతుగా సాయం చేశామని వారు చెప్పారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అనంతపురం సెంట్రల్ అధ్యక్షుడు గల్లా హర్ష, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి శాంతరాజ్, సభ్యులు సూర్యనారాయణ, పాండురంగయ్య, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, మేడా అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## భవనం ప్రారంభం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలోని జేఎన్‌టీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ నూతన భవనాన్ని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంబీఏ విభాగానికి కావాలసిన అన్ని సౌకర్యాలు, సహాయ సహకారాలు విశ్వవిద్యాలయం నుంచి నిరంతరంగా అందజేస్తామన్నారు. ఎంబీఏ భవనం భవిష్యత్తులో స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ప్రధాన కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏంబీఏ విభాగాధిపతి చంద్రమోహన్‌రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు, ఎగ్జామినేషన్ డైరెక్టర్, కంట్రోలర్, అసిస్టెంట్ కంట్రోలర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## 'మంజుల వెంకటేశ్‌కు బీజేపీతో సంబంధం లేదు'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ఫ్లెక్సీలను చింపేసిన మంజుల వెంకటేష్‌కి బీజేపీతో ఎటువంటి సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ తెలిపారు. దేవీనవరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలోని ఫ్లెక్సీలను మంజుల వెంకటేష్, అతడి మిత్రులు చింపేసి ఆర్యవైశ్యులపై అసభ్యకరపదజాలంతో దూషించిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. మంజుల వెంకటేష్‌కు బీజేపీతో ఎటువంటి సంబంధం లేదన్నారు. భవిష్యత్తులోనూ ఉండదని పేర్కొన్నారు.

## గేట్‌పై అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం సెమినార్ హాల్లో గురువారం గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ ఇన్ ఇంజనీరింగ్(గేట్) అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు రిసోర్స్ పర్సన్ సీవీఎస్ ప్రసన్న హాజరై మాట్లాడారు. గేట్ పరీక్ష విద్యార్థులు మాస్టర్ డిగ్రీ, డాక్టోరల్ ఫెలోషిప్‌నకు ఉన్నతమైన ఇన్స్టిట్యూట్ ప్రవేశం పొందడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పబ్లిక్ సర్వీసెస్ సెక్టార్స్‌లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి శ్రీనివాసులు, మాజీ ఆచార్యులు శంకర్ పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర: కలెక్టర్



పిల్లిగుండ్ల కాలనీలో వీధిని శుభ్రం చేస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్ల కాలనీలో గురువారం మండల అధికారులు స్వచ్ఛతాహిసేవలో భాగంగా ఏక్‌దిన్-ఏక్ గంట-ఏక్‌సాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు కలెక్టర్‌తో పాటు జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని శంకర్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి , కూటమి నేతలు హాజరయ్యారు. ముందుగా స్థానిక సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని, పౌష్టికాహార మాసోత్సవాల స్టాల్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 500లకు పైగా గ్రామాల్లో , మున్సిపాలిటీల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఒక రోజు చేయాల్సింది కాదన్నారు. మన ఇంటిని రోజూ ఏవిధంగా శుభ్రం చేసుకుంటామో పరిసరాలను కూడా అలాగే శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రత పనుల్లో పంచాయతీ కార్మికులకు సహకరించాలన్నారు. జిల్లాలో 3లక్షల మొక్కలును నాటారని, వాటిని సంరక్షించడం అందరి బాధ్యతని సూచించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజలందరి భాగస్వామ్యం తప్పక ఉండాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్మికులకు సబ్బులు, దుస్తులు తదితర వస్తువుల కిట్లను అందజేశారు. అలాగే అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరకపట్టి వీధిలో చెత్తను ఊడ్చి తొలగించారు. తర్వాత పరిశుభ్రతపై అందరూ ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, ఏపీఓ నాంచారమ్మ, ఏపీఎం రవి, పీఆర్‌జేఈ శేషయ్య, ఆర్ఐ సందీప్, సర్పంచ్ తేజస్విని, ఎంపీటీసీ సభ్యురాలు రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### స్వచ్ఛతాహి సేవలో ఏపీజీబీ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఉద్యోగులు స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం వెలుపల స్వచ్ఛతా హి సేవా కింద శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా పరిసరాల్లోని చెత్త, పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న గల బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో దసరా దీపావళ పండుగ సంబరాల రుణాల స్పెషల్‌డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్లను ఆర్ఎం శ్రీదేవి ఆవిష్కరించారు. ఏపీజీబీ చీఫ్‌మేనేజర్లు చైతన్య, అబ్దుల్ మునాఫ్, మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలకేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని చెత్తను అధికారులు శుభ్రం చేశారు. స్వచ్ఛతాహిసేవలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్, సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద, జూనియర్ అసిస్టెంట్ పార్వతి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒక్కరైన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వారు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషితారాజు మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని అనేక సంస్కరణలు చేసిన గొప్ప వ్యక్తి దీన్‌దయాల్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, అంజనేయులు, లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు ఈశ్వర్‌ప్రసాద్, నాగరాజు, కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుడిపై అక్రమ కేసు దారుణం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికుడిపై అక్రమ కేసు పెట్టడం దారుణమని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుడిపై అక్రమ కేసుకు నిరసనగా గురువారం వారు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి ముత్తూజా, జిల్లా కోశాధికారి గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులపై కేసు పెట్టిన చరిత్ర ఎన్నడూ లేదన్నారు. అవినీతి ఉద్యోగి అయిన ట్యాప్‌ఇన్‌స్పెక్టర్‌ను వెనుకేసుకొస్తూ ఇంజనీర్లు కార్మికుడిపై కేసు పెట్టడం దారుణమన్నారు. కమిషనర్ బాలస్వామి జోక్యం చేసుకుని ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, రాయుడు, నగర కార్యదర్శులు తిరుమలేష్, మురళీ, ఎర్రిస్వామి, లక్ష్మినరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఉపకరణాలు ఇస్తాం

శింగనమల,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అర్హత ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి ఉపకరణములు ఇస్తామని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రభుత్వం పంపిణీ చేసే ఉపకరణములపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల వైకల్యం బట్టి ఉపకరణాలు అందజేస్తుందన్నారు. ఇందుకు నియోజకవర్గాల వారీగా క్యాంపులు ఏర్పాటు చేసి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న దివ్యాంగులకు ఉపకరణములు ఇస్తామన్నారు. ఎంఈఓ నరసింహరాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులివ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కూటమి నేతల కలెక్టర్ ఆనంద్‌కు విన్నవించారు. కక్కలపల్లి కాలనీ పంచాయతీలో గురువారం జరిగిన స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యాక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి చైతన్య కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జేఎన్‌టీయూ వీసీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ సుదర్శన్‌రావు, ఉమర్ ముక్తార్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాం బర్‌లో గురువారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూలోని రతన్‌టాటా ఇన్నోవేషన్, స్టార్టప్ ఇ న్నోవేషన్ గురించి, పరిశోధనల గురించి వివరించారు.

### ఉమర్ ముక్తార్ భేటీ..

అనంతపురం ప్రెస్‌క్లబ్: నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉమర్ ముక్తార్ కలెక్టర్ ఆనంద్‌తో భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఆయన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో దూదేకులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్‌తో చర్చించినట్లు ఉమర్‌ముక్తార్ తెలిపారు.

## పండ్ల తోటల పెంపకంతో ఆర్థికవృద్ధి

గార్లదిన్నె, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పంపెకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట్లలో రైతు ఈశ్వరయ్య ఉపాధి పథకంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద చీనీ మొక్కలు నాటారు. ఆమొక్కలను గురువారం టెక్నికల్ అసిస్టెంట్ పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు: ఎంపీడీఓ

శింగనమల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన పింఛన్‌దారులందరికీ అక్టోబరు 1వ తేదీ పింఛన్లు ఇస్తామని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల ఒకటో తేదీన పంపిణీ చేసిన మాదిరిగానే వచ్చే నెల ఒకటో తేదీ కూడా మండలంలో 6,324 మంది పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేస్తామని అన్నారు.

## చిన్నారి మృతి బాధాకరం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



పాఠశాల వద్ద ఘటనపై ఆరా తీస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాడు గ్రామం వద్ద ఉన్న అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలో వేడిపాలలో పడి 16 నెలల చిన్నారి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విచారం వ్యక్తం చేశారు. ఘటన పట్ల బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్‌ను, సంబంధించిన అధికారులను కోరినట్లు గురువారం ఆమె పేర్కొన్నారు.

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాలను టీడీపీ జిల్లా నాయకులు పసువుల శ్రీరామిరెడ్డి, రవీంద్ర, ఓబుళపతి, సోమశేఖర్, ఆదినాయణ పరిశీలించారు. సంఘటనపై స్థానిక సిబ్బందిని ఆరా తీశారు.

## పరిశోధనలే ప్రతిభకు తార్కాణాలు



స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ విజయశ్రీ

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న రంగంలో నూతన అంశాన్ని ఆవిష్కరించే పరిశోధనలే మీ ప్రతిభకు తార్కాణాలని వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ పీజీ విద్యార్థులకు సూచించారు. వీడీఆర్ఎల్ లేబరేటరీలో విద్యార్థులకు గురువారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇన్‌చార్జి విభాగాధిపతి ప్రొఫెసర్ హైమావతి అధ్యక్షతన 'పోలిమరైజ్ చైన్ రియాక్షన్, ఎలిసా ఎగ్జామినేషన్' అనే అంశంపై ఏర్పాటుచేసిన తరగతులకు ప్రిన్సిపాల్ విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు విద్యార్థులే నాంది అన్నారు. అభ్యసనం, పరిశీలన నిరంతరం ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, డాక్టర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాల నిర్వహణపై తనిఖీ



వెంకటాంపల్లి వెటర్నరీ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి కళావతి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ నిర్వహణను విజయవాడ వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహాయసంచాలకులు, గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం లైసెన్ అధికారిణి కళావతి పరిశీలించారు. జిల్లాలోని తాడిపత్రి మండలం కావేటిసముద్రంలో గురువారం పలు పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం వెంకటాంపల్లి, కొర్రపాడు వెటర్నరీ ఆస్పత్రులు, తాడిపత్రి ఏడీ ఆఫీస్, తాడిపత్రి నియోజకవర్గ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి పలు రికార్డులను పరిశీలిచడంతోపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహణ, రక్తనమూనాల సేకరణపై ఆరా తీశారు. ఆ తర్వాత అనంతపురం నగరంలోని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు, తాడిపత్రి ఏడీ ఖాదీర్‌బాషా, వెటర్నరీ డాక్టర్లు సుబ్బారెడ్డి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## సింహవాహనంపై శ్రీవారి దర్శనం



సింహవాహనంపై దర్శనమిస్తున్న వేంకటేశ్వరుడు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజున గురువారం వేంకటేశ్వరస్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డులో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అనర్చకులు భూ దేవి, శ్రీదేవి సమేత స్వామివారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, తోమాల సేవ లు, ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయం త్రం సింహవాహనంపై స్వామివారిని ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంక్ వద్ద కాత్యాయనిగా దర్శనం



అమ్మవారిని దర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25: నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక అర్బన్ బ్యాంకు వద్ద నాలుగోరోజైన గురువారం అమ్మవారిని కాత్యాయనీదేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మేయర్ మదమంచి స్వరూప, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జేఎల్ మురళీధర్ అతిథులను సన్మానించారు. తర్వాత చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్ చైర్మన్లు మాగిశెట్టి చంద్రశేఖర్, వడ్డే మణి, డైరెక్టర్లు సుంకర రమేష్, అనిల్‌నాయుడు, గోల్డ్‌బాషా, రొళ్ల భాస్కర్, కృష్ణకుమార్, చింతా భాస్కర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అరటి వ్యాపారి మృతి

రాప్తాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపల్లి సమీపాన జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అరటి కాయల వ్యాపారి కురవ మల్లేశప్ప(53) మృతి చెందాడు. అనంతపురం నగరం భవానీ నగర్‌కు చెందిన ఆయన గురువారం ఉదయం అరటి కాయలు కొనేందుకు వెలుతున్నానని ఇంటిలో చెప్పి బయటికి వచ్చాడు. కాగా 11 గంటల సమయంలో గొళ్లపల్లి సమీపంలో జాతీయరహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా బెంగుళూరు నుంచి అనంతపురం వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

## గ్రామాల్లో వైద్య శిబిరం

నార్పల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గం, ఉయ్యాలకుంట-3 గ్రామాల్లో గురువారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత పలువురు గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్యసిబ్బంది, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కామారుపల్లి, నారాయణపురం పంచాయితీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో 280 బస్తాల యూరియాను రైతులకు అందజేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయావిస్తరణ అధికారులు మల్లికార్జున, భాగ్యశ్రీ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది శ్రీవిద్య, రేష్మ, టీడీపీ నాయకులు భాగ్యరాజ్, ఆదినారాయణ, కేవశ రెడ్డి, సత్యనారాయణ, రాము, పరుశురాం, ఎల్లప్ప, నారాయణస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్మాతా.. నమోనమః

● నవరాత్రుల్లో నాలుగో రోజున వివిధ అలంకరణలలో పూజలందుకున్న అమ్మవార్లు

● పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు



శివబాలయోగి ఆశ్రమంలో కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజున గురువారం నగరంలోని ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. వేకువజామునే అర్చకులు అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలో కాత్యాయనీదేవిగా..



హెచ్చెల్సీ కాలనీలో అన్నపూర్ణేశ్వరిగా నసనకోట ముత్యాలమ్మ



మొదటిరోడ్డు శివాలయంలో గజవాహనంపై ఇంద్రాణిదేవి అలంకరణలో అమ్మవారు



శివకోటి ఆలయంలో వారాహిదేవి అలంకరణలో..



పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో లలితాదేవి అలంకరణలో కాళికామాత..

## ఎక్సైజ్ నేరస్థులపై నిఘా పెంచండి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పాత కేసులకు సంబంధించి నేరస్థులపై నిఘా పెంచాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి మద్యం రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి నరసింహులు, సీఐ ఫరూక్ ఆజాం, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## డీలర్ల సంఘం అధ్యక్షుడి ఏకగ్రీవం

బెళుగుప్ప, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల చౌకధాన్యపు డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గుండ్లపల్లి డీలర్ దేవప్పను, ఉపాధ్యక్షుడిగా గంగవరం యర్రిస్వామిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బెళుగుప్పలో డీలర్ల సమావేశమై వీరిని ఎన్నుకున్నారు. తహసీల్దార్ అనిల్ కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## ఉద్యోగాలకు 89 మంది ఎంపిక

ఉరవకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలోని పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 117 మంది హాజరు కాగా.. 89 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొన్నాయని ప్రిన్సిపాల్ అస్రఫ్‌అలీ, ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

## ఏపీఎంగా ఎస్‌కేఎస్ హుస్సేన్

శెట్టూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా ఎస్‌కేఎస్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏపీఎం గంగన్న బొమ్మనహాళ్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో బ్రహ్మసముద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌కేఎస్ హుస్సేన్‌ను నియమించారు.

## మైక్రోఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన

కుందుర్పి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో ఏబీఎస్ సర్దార్ అధ్యక్షతన ప్రధానమంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఆహార సంస్థ మేనేజర్ మారుతి మాట్లాడుతూ... చిన్నచిన్న పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో చింతపండు రైతులు, వ్యాపారులు అధికంగా ఉండటంతో చింతపండు ప్రాసెసింగ్ చేయడానికి అవసరమైన యంత్రాల ఏర్పాటుతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు

## 'గేట్స్'లో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

గుత్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియేంటేషన్, ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆ కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, హెచ్‌ఓడీ హరిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

## పంట కలెక్షన్ సెంటర్ ప్రారంభం

కుందుర్పి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జొమటో హైపవర్ కంపెనీ పంట కలెక్షన్ సెంటర్‌ను ఆ సంస్థ క్లస్టర్ మేనేజర్ రంగనాయకులు, మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ఈ కలెక్షన్స్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇక్కడ పండించిన పంటను కొనుగోలు చేసి ... సుదూర ప్రాంతాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవో కులశేఖర్ రెడ్డి, ఏఎఫ్ ఏకాదశి, ఏఎఫ్ఏ కాలేజీ సిబ్బంది వెంకటేశులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంటు ప్రారంభం

బెళుగుప్ప, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) :స్థానిక శివాలయం వద్ద ఆర్డీటీ, శారద కాన్వెంట్ కమిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. నీటి బోరుకు రూ. 60 వేలు, బిల్డింగ్ నిర్మాణానికి రూ. 4 లక్షలు వెచ్చించినట్లు ఆర్డీటీ సంస్థ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు తెలిపారు. శారద కాన్వెంట్ కమిటీ ద్వారా రూ. 5.50 లక్షలు ఖర్చు చేసినట్లు సభ్యులు, విశ్రాంత టీచర్ వెంకటేశులు తెలిపారు. ప్లాంటు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా అందజేసిన స్థానికుడు రాజశేఖర్ రెడ్డిని పలువురు అభినందించారు.

## ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకారం



నూతన కమిటీ సభ్యులతో జేసీపీఆర్

తాడిపత్రి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలోని శ్రీ యర్రగుడి గంగమ్మ పాలక మండలి సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చైర్మన్‌గా రామసుబ్బారెడ్డి, సభ్యులుగా గంగిరెడ్డి, ఆదినారాయణ, కవిత, అనురాధ, కుళ్లాయమ్మ, సాలమ్మ దేవాదాయశాఖ ఈఓ రామాంజనేయులు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన వైసీపీ మండల కన్వీనర్

యల్లనూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శైలజానాథ్ మండల సమస్యలపై ఆరా తీసినట్లు ఆయన తెలిపారు.



జగన్‌మోహన్‌రెడ్డితో రామాంజనేయులు

## నూతన ఉపాధ్యాయుడికి అభినందనలు

పెద్దపప్పూరు సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి మెగా డీఎస్సీ ఉత్సవ్ కార్యక్రమంలో మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన మండ్లి విజయ్‌కుమార్‌రెడ్డి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో గురువారం పీఈటీగా నియామక పత్రాన్ని అందుకున్నారు. విజయ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



విజయ్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

## నూతన సీఐగా రామారావు

గుత్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐగా రామారావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు సత్యసాయి జిల్లా పుట్టపర్తి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పుట్టపర్తి వీఆర్వోలో ఉన్న రామారావును నియమించారు.

## శ్రీవారికి అన్నకూటోత్సవం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహా అన్నకూటోత్సవ సేవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 108 రకాల పదార్థాలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.



## తాడిపత్రి మున్సిపాల్టీకి మొదటి ర్యాంక్

తాడిపత్రి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో తాడిపత్రి మున్సిపాలిటీ 8 స్టార్స్ రేటింగ్‌తో రాష్ట్రంలో మొదటిస్థానం సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి ప్రజలు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమన్నారు.

## పోక్సో కేసు నమోదు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మోదీనాబాద్ ఏరియాకు చెందిన యువకుడు హెచ్. మనోహర్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి ఈనెల 15న లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆ బాలిక తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు .. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు.. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మనోహర్ గురువారం తెలిపారు.

## గుత్తిలో విజిలెన్స్ దాడులు

గుత్తి,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) :పట్టణంలో గురువారం గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక గాంధీసర్కిల్ సమీపంలో షేక్ జిలాన్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 21 డోమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసి.. స్థానిక సీఎస్‌డీటీ ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. కేసు నమోదు చేశారు.

## మోటార్, డ్రిప్ పరికరాల చోరీ

విడపనకల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొట్టాలపల్లికు చెందిన మోదుపల్లి లక్ష్మినారాయణ పొలంలోని విద్యుత్ మోటార్‌ను, డ్రిప్ పరికరాలను బుధవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. వాటి విలువ దాదాపుగా రూ. 80వేలు ఉంటుందని, నెల క్రితమే తన పొలంలో వాటిని ఏర్పాటు చేశానని లక్ష్మినారాయణ వాపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు.

## నానో యూరియా పిచికారి

యల్లనూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దమల్లేపల్లి గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ నానో యూరియా వాడకంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. 25 ఎకరాల్లో మొక్కజొన్న, వరి పొలాల్లో ఉచితంగా డ్రోన్ ద్వారా నానో యూరియాను పిచికారి చేయించారు. ఆమె వెంట ఆత్మ డైరెక్టర్ పద్మలత, సైంటిస్టులు బాబు, భాస్కర్, నారాయణస్వామి ఉన్నారు.

## 'మంజుల వెంకటేశ్‌కు బీజేపీతో సంబంధం లేదు'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ఫ్లెక్సీలను చింపేసిన మంజుల వెంకటేష్, అతని మిత్రులకు బీజేపీతో ఎటువంటి సంబంధమూ లేదని, భవిష్యత్తులోనూ ఉండబోదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ గురువారం స్పష్టంచేశారు. వీరు ఆర్యవైశ్యులను అసభ్యపదజాలంతో దూషించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి షోకాజ్

శెట్టూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బొచ్చుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓబుళపతికి స్థానిక ఎంపీడీఓ జిలాని బాషా షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో షోకాజ్ నోటీసు జారీ చేశామని ఎంపీడీఓ తెలిపారు.

### ప్రకటన

కండిబదాలు అశోక్‌కుమార్, S/o భీమలింగప్ప, D.No.6/1098-E, భాగ్యనగర్,గుంతకల్లు వారికి సంబంధించిన అస్తి గుంతకల్లు మండలం, గుంతకల్లు గ్రామ పొలంలో, మున్సిపల్ ఎలక్ట్రికల్ పవర్ హౌస్‌కు సమీపాన గల రెసిడెన్షియల్ ఏరియాలో D.No. 7/27 కు సమీపాన సర్వేనెం. 349B లో ప్లాట్:54,55, 195.55 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగు తున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు:ప్లాట్:81,82, పడమర:20అ॥రోడ్డు,ఉత్తరం: ఎం. తిమ్మారెడ్డి గారి భూమి, దక్షిణము: ప్లాట్.53.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### ప్రకటన

ఉప్పర ఎర్రిస్వామి, S/o ఉప్పర మారెన్న, విడపనకల్లు గ్రామం & మండలం వారికి సంబంధించిన అస్తి విడపనకల్లు మండలం, విడపనకల్లు గ్రామ పంచాయితీ ఏరియా చేరిన సర్వేనెం.537-B లో 137 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు:ఉప్పర గోవిందు రాజులు ఇల్లు, పడమర: ఉప్పర అంజనేయులు బయలు, ఉత్తరం: వి.బాల రంగారెడ్డి బయలు, దక్షిణము: రస్తా.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### ప్రకటన

కావలి సురేష్ S/o కావలి వెంకటేష్ D.No.20/1874, హౌసింగ్ బోర్డ్ కాలనీ, గుంతకల్లు వారికి సంబంధించిన అస్తి గుంతకల్లు మండలం, కసాపురం గ్రామ పొలంలో సర్వేనెం. 197-A24 లో D.No.1/0, కలిగి శిథిలమై ప్రస్తుతం బయలు స్థలము, 151.11 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు:లక్ష్మీదేవి గారి స్థలం, పడమర: రోడ్డు, ఉత్తరం: దాకలి రంగస్వామి స్థలం, దక్షిణము: రోడ్డు.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2, అనంతపురంవారు అది అంధ్ర నాగలక్ష్మీ భర్త అది అంధ్ర వెంకట రాముడు అను పేరున గల అస్తి తాకట్టుపై అది అంధ్ర వెంకటరాముడు తండ్రి: ఎ.నాగన్న D.No. 3-14, యస్.సి.కాలనీ, కనగానపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు. దీని పై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
హిందూపురం రి॥డి॥ చెన్నేకొత్తపల్లి సబ్ రి॥డి॥ కి చేరిన కనగానపల్లి గ్రామ పంచాయితీ పరిధి లోని సర్వే నెం.382-4లో 5 సెంట్ల స్థలం, చెక్కుబంది :- తూర్పు : విరాట పెద్దన్న ప్లాటు , పడమర : రోడ్డు, ఉత్తరం : రస్తా, దక్షిణం : హరిజనవాడ దారి.

**వై.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,**
అనంతపురం. సెల్ 9440565907

### బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2, అనంతపురం వారు క్రింద తెలిపిన అస్తి తాకట్టుపై పి.మనోహర్ తండ్రి: జి.నారాయణ, చిన్మయి నగర్, రాప్తాడు మండలం, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు. దీని పై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురంరి॥డి॥ అనంతపురం రూరల్ సబ్ రి॥డి॥కి చేరిన రాప్తాడు మండలం గోవిందంపల్లి గ్రామ పంచాయితీ పరిధి లోని సర్వే నెం.270లో ప్లాట్ నెం. 35, చెక్కుబంది :- తూర్పు : సి షెడ్యూలు ప్రాపర్టీ లోని జి.ముకుందర్‌కు చెందిన ప్లాటు నెం.34, పడమర :ప్లాటునెం. 36, ఉత్తరం: రోడ్డు, దక్షిణం : బూసువల్లి రామిరెడ్డి భూమి.

**వై.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,**
అనంతపురం. సెల్ 9440565907

### ప్రకటన

షేక్ బాబావలి S/o షేక్షావలి, కామాలపురం గ్రామం, గార్లదిన్నె మండలం, వారికి సంబంధించిన అస్తి పామిడి మండలం, పామిడి గ్రామ పొలంలోని నగర పంచాయితీలో D.No.13/465, కు సమీపాన సర్వే నెం.326 లో ప్లాట్: 93A, 195.55, గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు: గౌస్ పీరా ప్లాటు, పడమర: 20 అడుగుల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.93, దక్షిణము: బాష ప్లాటు.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### ప్రకటన

నేసే శ్రీదేవి W/o N.గాది లింగప్ప హోలహర్వి గ్రామం & మండలం, కర్నూలు జిల్లా వారికి సంబంధించిన అస్తి గుంతకల్లు మండలం, తిమ్మనచెర్ల గ్రామ పొలంలో వాల్మీకి నగర్, సిద్దేశ్వర కాలనీ రెసిడెన్షియల్ ఏరియాలో D.No. 13/233కు సమీపాన సర్వే నెం.337Aలో 150 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు: టీచర్ క్రిష్ణవేణమ్మ గారి స్థలం, పడమర: జె.లక్ష్మీబాయమ్మ గారి స్థలం ఉత్తరం: వన్నప్ప గారి స్థలం, దక్షిణము: 10 అడుగుల రోడ్డు.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### ప్రకటన

కురువ హరిత W/o కురువ నెట్టెప్ప, డో.నెం.1/43, మెయిన్ రోడ్, కుందనగుర్తి గ్రామం , చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా వారికి సంబంధించిన అస్తి గుంతకల్లు మండలం, తిమ్మనచెర్ల గ్రామ పొలంలో సర్వే నెం.253-A, 254-A, 255-1B లో ప్లాట్:3,4,5,6,8, ప్లాట్లను గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ అస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్‌ను సంప్రది ంచగలరు.
హద్దులు:- తూర్పు: ప్లాట్:5, పడమర: 33 అడుగుల రోడ్డు, ఉత్తరం: ప్లాట్:01, దక్షిణము: ప్లాట్:03.

**M.G. భాస్కర్‌గౌడ్**
అడ్వకేట్, గుంతకల్లు

### బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2, అనంతపురం వారు యదవల్లి శంకరయ్య తండ్రి మారెన్న అను పేరున గల అస్తి తాకట్టుపై ఎ.నాగలక్ష్మి భర్త: ఎ.శంకర నారాయణ D.No. 19-654-A9, బిందెల కాలనీ, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు. దీని పై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురం రి॥డి॥అనంతపురం సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం నగరపాలక సంస్థ ఏరియా పరిధిలోని సర్వే నెం. 189/2 లో డో.నెం.19/650 గల ఇల్లు, చెక్కుబంది :- తూర్పు : ప్లాటు నెం.17, పడమర: ప్లాటు నెం.15,ఉత్తరం : రోడ్డు, దక్షిణం : సర్వేనెం.190/2 లో భూమి.

**వై.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,**
అనంతపురం. సెల్ 9440565907

### బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2, అనంతపురం వారు కె.ప్రభావతి భర్త కె.జాన్సన్ అను పేరున గల అస్తి తాకట్టుపై కె.జాన్సన్ తండ్రి: లేట్ కె.ఓబులేసు D.No. 1-66, చంద్రప్రియ నగర్, గుత్తి, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు. దీని పై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ గుత్తి సబ్ రి॥డి॥కి చేరిన గుత్తి పట్టణంలోని సర్వే నెం.495-2లో ప్లాట్ నెం.21,
చెక్కుబంది :- తూర్పు : ప్లాటు నెం.22 & 23, పడమర : 40 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాట్‌నెం.20, దక్షిణం : 33 అడుగుల రోడ్డు.

**వై.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,**
అనంతపురం. సెల్ 9440565907